సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

1 విజయనగరం జిల్లా డెంకాడకు చెందిన 55 ఏళ్ల వ్యక్తి అనారోగ్యం కారణంగా సమీపంలో ఉన్న వైద్యుడిని సంప్రదించాడు. ఆ పేషెంట్‌కు వైద్య పరీక్షలు చేసిన వైద్యుడు కేజీహెచ్‌కు వెళ్లాలని తెలిపారు. తీరా కేజీహెచ్‌కు వచ్చేసరికి ఓపీ కౌంటర్ వద్ద పెద్ద క్యూ. ఫోన్‌లో నమోదు అనేసరికి దిక్కుతోచని స్థితిలో కూలబడ్డాడు.

2 ఎస్. కోటకు చెందిన రమాదేవి గైనిక్ సమస్యతో బాధపడుతోంది. అక్కడి వైద్యురాలిని సంప్రదించగా టెస్ట్‌లు రాశారు. రిపోర్టులు చూసిన వైద్యురాలు విశాఖలోని కేజీహెచ్ వైద్యులను సంప్రదించమనడంతో ఇక్కడికి వచ్చారు. ఓపీ నమోదు వద్ద చాలా సమయం పట్టేసింది.

3 పెందుర్తి ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు అనారోగ్యంతో కేజీహెచ్‌కు వచ్చాడు. ఆయనకూ ఇదే పరిస్థితి ఎదురైంది.

ఇలా..నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వేలాది మంది అనారోగ్యం కారణంగా కేజీహెచ్‌కు నిత్యం వస్తుంటారు. అలా వైద్యం కోసం వచ్చిన వారికి ఓపీ (ఔట్ పేషెంట్) చీటీ తీసుకోవడమే గగనమైపోతోంది. ఎన్నో ప్రయాసలు పడి ఇక్కడికి వచ్చిన వారు కొత్త విధానంలో, గంటల తరబడి ఓపీ నమోదుతో అవస్థలు పడుతున్నారు. - డాబాగార్డెన్స్

ఓపీ నమోదే ఓ ప్రహసనం

కేజీహెచ్‌లో రోగుల ఓపీ కష్టాలు ● స్మార్ట్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ తప్పనిసరి

నిరక్షరాస్యులు, వృద్ధుల అవస్థలు ● నిత్యం ఓపీ 2 వేలకు పైనే..

ఓపీ కౌంటర్ వద్దనే గడిచిపోతున్న సమయం ● గతంలోనే నయమంటున్న పేషెంట్లు



అభా యాప్‌లో ఓపీ తీసుకునేందుకు పేషెంట్లకు సహకరిస్తున్న ట్రైనీ నర్సులు



కేజీహెచ్ పరిసర ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా పార్క్ చేసిన పేషెంట్లు, సహాయకుల వాహనాలు

కేజీహెచ్‌కు వచ్చిన రోగులకు ఓపీ నమోదు కష్టతరంగా మారింది. గతంలో ఓపీ నంబరు 1కి వెళ్లి క్యూ కడితే, పది నిమిషాల నుంచి పావుగంటలోపే ఓపీ టికెట్ ఇచ్చేవారు. పేరు, వయసు, వ్యాధి తదితర వివరాలు అడిగి.. వెంటనే ఓపీ టికెట్ జారీ చేసేవారు. పెరిగిన సాంకేతికత పనులను సులువు చేయాలి కానీ, ఇక్కడ మాత్రం ఓపీ టికెట్ తీసుకోవాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని పలువురు పేషెంట్లు వాపోతున్నారు.



ఓపీ గేట్లోకి వాహనాలను వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది

పార్కింగ్‌తో మొదలు..

కేజీహెచ్ ఓపీ తీసుకోవాలంటే వాహన పార్కింగ్‌తో సమస్య మొదలు. ఓపీ సమయాల్లో ఎటువంటి ప్రైవేట్ (పేషెంట్లు.. పేషెంట్ల సహాయకుల వాహనాలు) వాహనాలు లోపల నిలిపేందుకు సెక్యూరిటీ గార్డులు అనుమతి ఇవ్వరు. తెచ్చుకున్న వాహనాన్ని ఎక్కడ నిలపాలో తెలియక దాదాపు అరగంట పాటు అటూ.. ఇటూ తిరిగి, ఓపీ బయట ఎక్కడ ఖాళీ స్థలం ఉంటుందో అక్కడ నిలిపేందుకు అవస్థలు పడాలి. ట్రాఫిక్ పోలీసులకు ఏ మాత్రం ఇబ్బంది ఉన్నా.. కేజీహెచ్ చుట్టూ పార్క్ చేసిన వాహనాలకు ఫొటోలు తీసి కేసులు నమోదు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలంటా..

ఓపీ టికెట్ తీసుకోవాలంటే ముందుగా మన వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారా అభా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత ఓపీ కౌంటర్‌కి వెళ్తే ఓపీ టికెట్ ఇస్తారు. ఈ క్రమంలో స్మార్ట్ ఫోన్ ఉన్న వారు యాప్ డౌన్లోడ్ చేసుకుని పూర్తి వివరాలు అప్‌లోడ్ చేసి నేరుగా ఓపీ టికెట్ తీసుకుంటున్నారు. మరి, స్మార్ట్‌ఫోన్ లేనివారి పరిస్థితి చూస్తే.. ట్రైనింగ్ పొందుతున్న నర్సింగ్ విద్యార్థినులతో డేటా అప్‌లోడ్ చేయిస్తున్నారు. ఈ తంతు అంతా దాదాపు గంట నుంచి గంటన్నరకు పైగా పడుతోందని పేషెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాసెస్ అంతా అయి, ఓపీ తీసుకుని వెళ్లేసరికి ఓపీ వైద్యులు వెళ్లిపోతున్నారని.. మరుసటి రోజు మరలా ఓపీ తీసుకునే దుస్థితి ఉందని వాపోతున్నారు.

డాక్టర్లు లేకుంటే ఇక అంతే..

ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓపీ చీటీలు ఇస్తున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ తెరిచే ఉంటుంది. ఇదిలా ఉండగా వైద్యులు ఉదయం 9.30 తర్వాత ఓపీకి వచ్చి,1 గంట వరకు ఉండి వార్డులకు వెళ్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు వచ్చి, 4 గంటలకు వెళ్తున్నారు. ఓపీ చీటీ తీసుకుని వెళ్లిన పేషెంట్లు డాక్టర్ ఉంటే చూపించుకోవడం లేదంటే మళ్లీ రావలసిందే.

మొక్కుబడిగా పర్మినెంట్ ఉద్యోగుల తీరు

ఓపీ విభాగానికి సంబంధించి 16 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో నలుగురు పర్మినెంట్ ఉద్యోగులు. మిగిలిన వారు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది. పర్మినెంట్ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించకుండా ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపైకి పనులు నెట్టేస్తున్నారనే విమర్శలున్నాయి. రాత్రి డ్యూటీలకు కూడా పర్మినెంట్ ఉద్యోగులు ససేమిరా అంటున్నారంటూ పలువురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.



ఓపీ కౌంటర్ వద్ద బారులు తీరిన రోగులు

క్లుప్తంగా

జోన్-4లో వాణిజ్య దుకాణాలకు 23న బహిరంగ వేలం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-4 పరిధిలోని పలు వాణిజ్య సముదాయాలకు సంబంధించి ఈ నెల 23న ఉదయం జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ప్రకటనలో తెలిపారు. సూర్యాబాగ్ డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం, జగదాంబ వాణిజ్య సముదాయం, పాత బస్టాండ్ దుకాణాలు, పద్మానగర్ వాణిజ్య సముదాయం, సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం, టీఎస్ఆర్ వాణిజ్య సముదాయం, అంగటిదిబ్బ వాణిజ్య సముదాయంలో కొన్ని దుకాణాలు, జీవీఎంసీ మెయిన్ ఆఫీస్ క్యాంటీన్, అంబేడ్కర్ కల్యాణ మండపం, రెల్లివీధి రోడ్‌సైడ్ ఫిష్ మార్కెట్ 3 ఏళ్ల కాలానికి బహిరంగ వేలం ద్వారా ఇవ్వనున్నట్టు జోనల్ కమిషనర్ తెలియజేశారు. వేలంలో పాల్గొనదలచే వారు డిపాజిట్ సొమ్ము, పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయ పని వేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని సూచించారు.

మహిళలకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

జగదాంబ: పూర్ణా మార్కెట్‌లో బుధవారం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో రుతు విరతిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుషాల్ మెటర్నల్ హెల్త్ ప్రాజెక్ట్ కార్యకర్తలు మహిళా వ్యాపారులకు అవగాహన కల్పించారు. మహిళల్లో సహజంగా సంభవించే రుతువిరతి దశ లక్షణాలను వారికి తెలియజేశారు. శరీరంలో అండాశయాలు ఈస్ట్రోజన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్ల ఉత్పత్తి చేయడాన్ని తగ్గిస్తాయని వివరించారు. బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వాటిపై అవగాహన కల్పించారు.

సజీవమైనది మాండలికం



ప్రసంగిస్తున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: మానవ సమాజంలో సాంఘిక జీవనం భాష వల్లే సాధ్యపడుతుందని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అన్నారు. రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం 'మాండలిక భాష, ఉత్తరాంధ్ర మాండలిక సాహిత్యం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. భాష వివిధ రకాలుగా వ్యవహరించబడితే మాండలికాలు ఏర్పడతాయన్నారు. ఇవి భాషకు సజీవ చిహ్నాలని, జీవ భాషకు మార్పులు సహజం కాబట్టి.. దీని వల్ల భాషా రూపాన్ని గ్రహించడమే మాండలికాల ప్రత్యేకతగా పేర్కొన్నారు. భాష చరిత్రను, ప్రాంతం చరిత్రను మాండలికాల వల్ల తెలుసుకోవచ్చన్నారు. తెలుగు భాషను కళింగ, కోస్తా, రాయలసీమ, తెలంగాణ మండలాలుగా విభజించవచ్చని తెలిపారు. ఈ ప్రసంగాన్ని రచయిత చల్లా రాంబాబు సమీక్షించారు. కార్యక్రమంలో రచయితలు సిహెచ్.చినసూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, చాగంటి జోగారావు, కె.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి స్టీల్‌క్లబ్ వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న స్టీల్‌క్లబ్ అధ్యక్షుడు మధుసూదనరావు

ఉక్కునగరం: ఉక్కు కనిష్ఠ అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం (స్టీల్‌క్లబ్) వార్షికోత్సవ వేడుకలు ఈనెల 18 నుచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నామని స్టీల్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.మధుసూదనరావు తెలిపారు. స్టీల్‌క్లబ్ 22వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18న శుక్రవారం మెగా బంపర్ హౌసీ ఏర్పాటు చేశామన్నారు. 19న సాంస్కృతికోత్సవంలో భాగంగా మెగా మ్యూజికల్ అండ్ డ్యాన్స్ నైట్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఇండియన్ ఐడల్ గాయకులు హర్షవర్ధన్, ప్రసన్న, జయంత్ మాథుర్ తదితర గాయకులు పాల్గొంటారని.. అంతర్జాతీయ గాయకులు సుప్రీం శేఖర్ తమ గానంతో అలరించనున్నారన్నారు. 20న అంతర్జాతీయ నృత్యకళాకారిణి గుణశ్రీ ప్రత్యేక నృత్యాలు ఉంటాయని తెలిపారు. క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ మాట్లాడుతూ సభ్యుల ఆహ్లాదం కోసం నిర్వహిస్తున్న వేడుకలకు క్లబ్ సభ్యులు తమ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ కార్యవర్గ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కుట్టు శిక్షణ



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజ్ఞాన కేంద్రం పరిశోధనా విభాగం ఇన్‌చార్జి పద్మ

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కేంద్రాన్ని విజ్ఞాన కేంద్రం పరిశోధనా విభాగం ఇన్‌చార్జి కె.పద్మ బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 10 కుట్టు మిషన్లతో ఈ కేంద్రం ప్రారంభమైందని, డిమాండ్‌ను అనుసరించి మిషన్ల సంఖ్య పెంచుతామని చెప్పారు. విజ్ఞాన కేంద్రం సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రారంభమైన ఈ శిక్షణ, మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందన్నారు. కేంద్రం కార్యక్రమాల కమిటీ కన్వీనర్ జీఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రజల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరాలు, ఫ్రీ క్లినిక్ నిర్వహించడమే గాక కంప్యూటర్ శిక్షణ కూడా అందిస్తోందన్నారు. వాటికి టైలరింగ్ శిక్షణ కూడా తోడైందని, పరిసర ప్రాంతాల మహిళలు టైలరింగ్ శిక్షణ పొందేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 83309 48949 నంబరులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు బుజ్జి, శిక్షకురాలు పి.ఎస్.మణి, ఎమ్మర్తి రాజు, వై.సత్యనారాయణ, కె.మణి తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు కాలువల శుభ్రత



పెద్ద కాలువలోని చెత్తను తీయిస్తున్న జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు

జగదాంబ: కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందిని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. జోన్ పరిధిలోని 12 వార్డుల్లో బుధవారం ఆయన పర్యటించి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో జెడ్సీ మాట్లాడుతూ వార్డుల్లోని ప్రధాన కాలువలే కాకుండా వీధుల్లోని చిన్న కాలువలను కూడా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలన్నారు. దీని వల్ల దోమల ఉత్పత్తి తగ్గి, వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. కాలువల్లో బ్లీచింగ్ వేయాలని, యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టాలని సూచించారు. నీటి ప్రవాహం ఆగిన ప్రాంతాల్లోని కాలువల్లో పొక్లెయిన్‌తో పూడికలు తీయించి మురుగు ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారుల పక్కన చెత్త కుప్పలు లేకుండా చెత్తను ఎత్తించి యార్డుకు తరలించాలన్నారు. రోడ్డు పక్కన పాడైన డస్ట్ బిన్‌లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని జెడ్సీ సూచించారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం



చంద్రబాబు మోసాలను ఇంటింటా వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ 30వ వార్డు అధ్యక్షుడు మాణిక్యాలరావు, నాయకులు

డాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు, మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ సూచనలతో బుధవారం 30వ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ ఇంటింటా కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు నేతృత్వంలో జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కోన శంకర్, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్, వార్డు నాయకుడు దశమంతుల చిన్ని తదితరులు కోడిపెండ్యాల వీధిలో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ కూటమి పాలకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేకపోయారని విమర్శించారు. చంద్రబాబును ఇంటికి పంపించే రోజులు సమీపంలోనే ఉన్నాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లకు పైగా పేదలకు పథకాల లబ్ధిని అందించిందని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, తప్పకుండా పేదలకు మంచి జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్థానిక ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రమేష్‌నాయుడు, దశమంతుల సంతోషి, కల్యాణి, మీనా, మణి, జ్యోతి, సునీతచ పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో వినియోగదారులకు హాని



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎం.వి.ఎస్.శర్మ, వార్వా - నివాస్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: స్మార్ మీటర్లు చాలా ఖరీదైనవని, వీటిలో అంతర్నిర్మిత యంత్రాంగం వినియోగదారులకు హాని కలిగించేలా తయారుచేశారని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. సీతమ్మధారలోని విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్(వార్వా) - నివాస్ ఆధ్వర్యంలో బుధవారం వార్వా నివాస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ప్రమాదకరమైనవని, వీటి ద్వారా పీక్-నాన్ పీక్ టైమింగ్‌లను విధించడం, ప్రజలకు సరఫరా చేస్తున్న మీటర్లపై అధిక ధరలు రుద్దడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్ వ్యవస్థ ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్కంల నుంచి అదానీ వంటి ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు విద్యుత్ సరఫరా పంపిణీపై నియంత్రణను మోసపూరితంగా బదిలీ చేయడానికి దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ సిస్టం దుష్ప్రభావాలను బహిర్గతం చేస్తూ వార్వా-నివాస్ తయారుచేసిన కరపత్రాన్ని ఈ సందర్భంగా వీరు ఆవిష్కరించారు. నగరవాసులు, తమ ఇళ్లు, ఫ్లాట్‌ల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అనుమతించవద్దని పిలుపునిచ్చారు. సమావేశంలో వార్వా ప్రెసిడెంట్ ఎన్.ప్రకాశరావు, జనరల్ సెక్రటరీ బి.బి.గణేష్, నివాస్ జనరల్ సెక్రటరీ పిట్టా నారాయణమూర్తి, కె.సత్యవతి, హరిప్రసాద్, బి.కృష్ణమోహన్, ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

కోస్టల్ టూరిజంతో అభివృద్ధి



కెప్టెన్ యోగేష్‌ను సత్కరిస్తున్న హెచ్‌వోడీలు

మద్దిలపాలెం : ఆంధ్రా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆంధ్ర ఆధ్వర్యంలో బుధవారం కోస్టల్ టూరిజంపై అతిథి ఉపన్యాసాన్ని పీటర్ డక్కర్ స్మార్ట్ సెమినార్ హాలులో నిర్వహించారు. ఇండియన్ మారిటైం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ కెప్టెన్ యోగేష్ చంద్రలాల్ షా అతిథోపన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 13 పెద్ద నదులు ఉన్నాయని... ఆ నదులను సముద్రానికి అనుసంధానం చేస్తూ రవాణా వ్యవస్థను, టూరిజాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అలా చేస్తే గ్రామాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయన్నారు. అనంతరం కెప్టెన్ యోగేష్ చంద్రలాల్ షాను విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య ఘనంగా సత్కరించారు.

'అర్ధ నూటపదహార్లు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: తాళాభక్తుల లక్ష్మీప్రసాద్ రచించిన 'అర్ధ నూటపదహార్లు' పద్య సంపుటి పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. స్వరరాగ సుధ లలిత భక్తి గీతాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న పద్య ప్రక్రియను తన వంతు కర్తవ్యంగా భావించి అలతి అలతి పదాలతో పద్య సంపుటి రచించి, ఆటవెలది వృత్తంలో మనకు అందించారని రచయితను అభినందించారు. డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ ఈ పద్య సంపుటిని అర్ధ నూటపదహార్లతో క్లుప్తీకరించకుండా, నూటపదహార్లుగా రాయాలని సూచించారు. డాక్టర్ కొచ్చెర్లకోట వెంకట సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలను, మూఢవిశ్వాసాలను స్పృశిస్తూ ఆటవెలది పద్యాలు రాయడం వేమనను గుర్తుచేశాయని కొనియాడారు. పద్య కవి చిన్నసూరి రచయితను అభినందించారు. అనంతరం లక్ష్మీప్రసాద్ పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. మేడా మస్తాన్‌రెడ్డి నిర్వహణలో జరిగిన ఈ సభలో స్వరరాగ సుధ వ్యవస్థాపకులు పి.వి.పద్మిని పాల్గొన్నారు. గాయనీ గాయకులు కోరుకొండ రంగారావు, ధనలక్ష్మి, పూర్ణ, చంద్రకళ, సునీత పాడిన లలిత గీతాలు అలరించాయి.

సముద్ర తీరంలో ఎడారి ఓడ



సముద్ర తీరంలో సహజంగా ఓడలు కనిపిస్తాయి. ఎడారి ప్రాంతంలో ఇసుకపై సంచరించడానికి ఎడారి ఓడ (ఒంటె)లు కనిపిస్తాయి. అయితే సముద్ర తీరంలో ఇసుక తిన్నెలపై ఒంటెలు కనిపిస్తే కొంచెం వింతగా ఉంటుంది. విశాఖ సాగర తీరంలో నిత్యం ఒంటెపై సవారీ అందుబాటులో ఉంది. కొంత మంది ప్రత్యేకంగా ఒంటెను పెంచుతూ సాగర తీరంలో సాయంత్రం వేళలో పర్యాటకులతో సవారీ చేయిస్తూ ఆదాయం సంపాదిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఇది ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఒంటెపై కూర్చుని ఫొటోలు తీసుకుంటూ, సవారీ చేస్తూ పర్యాటకులు సంతోషాన్ని పొందుతున్నారు. – ఏయూ క్యాంపస్

యువతతోనే నవ సమాజ నిర్మాణం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, బుల్లయ్య కళాశాల అధ్యాపక బృందం

సీతంపేట: 'నవ సమాజ నిర్మాణం రేపటి భారతదేశానికి విప్లవాత్మక మేల్కొలుపు' అనే అంశంపై స్థానిక బుల్లయ్య కళాశాలలో బుధవారం ప్రేరణాత్మక సెషన్ జరిగింది. ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం అనేది చర్యకు పిలుపుని, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. నగరం మధ్యలో ఉన్న బుల్లయ్య కళాశాలలో సుమారు 7 వేల మంది విద్యార్థులున్నారని, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల బారిన పడి చాలా మంది మోసపోతున్నారన్నారు. సరదాకో, స్నేహితులు బలవంతం చేశారనో డ్రగ్స్ తీసుకోవడం వల్ల విద్యార్థుల జీవితాలు నాశనమవుతున్నాయని, తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు నిరాశకు గురవుతున్న సంఘటనలు నిత్యం మనం చూస్తున్నామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల ఉచ్చులో యువత పడకుండా లక్ష్యంపై దృష్టి సారించాలన్నారు. మహిళలపై హింస, ట్రాఫిక్ క్రమశిక్షణ రాహిత్యానికి వ్యతిరేకంగా ఒక యుద్ధం చేద్దామని పిలుపునిచ్చారు. విశాఖ మహా నగరంలోని ప్రతి పౌరుడిలో వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి, ధైర్యం నింపడానికి, తమ బాధ్యతలు గుర్తుచేసుకునేందుకు ఇటువంటి ప్రేరణ సెషన్లు దోహదపడతాయని చెప్పారు. అనంతరం దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, మహిళలపై హింసకు పాల్పడమని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.